

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 20 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 227 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY SEPTEMBER 20 2026 | VOL:18 | ISSUE: 227 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: ప్రజలను కోరిన సీఎం రేవంత్

ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శ

భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత

మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని

స్టార్టప్‌లే భారతదేశపు యువత సత్తాకు నిదర్శనం..!

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికిపైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందన్నారు. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఇది భారతదేశ నూతన ఆర్థికవ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా స్టార్టప్‌ల స్థాపనలో కీలకపాత్ర పోషిస్తున్నారని

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణలో మళ్లీ వానలు: నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పెరగనున్న వానలు

ములుగు, ఖమ్మం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

రాష్ట్రంలో ఇప్పటివరకు 19 శాతం లోటు వర్షపాతం నమోదు



వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ)

(మిగతా 2వ పేజీలో..)

రేవంత్ ఆ డైలాగ్‌ను దించేశాడు.. నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు : కేటీఆర్

నీ సొంతూరు కొండారెడ్డి పల్లి రైతులు శ్రీశైలం హైవే ఎక్కి కరెంట్ రావడం లేదని ధర్నా చేస్తున్నరు.. కనబడుతలేదా..? రేవంత్ నీకు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు. రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సొంత గ్రామ రైతులు రోడ్డెక్కుతున్నరంటే సిగ్గు లేదా..? ఆ డిప్యూటీ సీఎం ఉన్నడ్రు.. ఎల్‌నినోతోని కరెంట్ వస్తలేదని ఆయన అంటడు. ఎల్‌నినోతో కరెంట్ కాదు.. ఎల్‌నినోతో నీళ్లు కాదు.. దేవ్వడ్రు నీళ్లిచ్చిండు.. బొగ్గు ఇచ్చిండు..



పోటీ నుంచి వైదొలగినట్లు ప్రకటన.. గంటల్లోనే మనసు మార్చుకున్న మమతా బెనర్జీ పార్టీ అభ్యర్థి

రెజీనగర్ ఉపఎన్నిక బరి నుంచి తప్పుకున్న మమత అభ్యర్థి

కొన్ని గంటలకే నిర్ణయం మార్చుకొని మళ్లీ పోటీ చేస్తున్నట్లు ప్రకటన

మమత బెనర్జీ పట్టుబట్టడంతోనే వెనక్కి వచ్చిన రబీఉల్ ఆలమ్ చౌదరి

నందిగ్రామ్‌లోనూ మమత వర్గానికి వరుస ఎదురుదెబ్బలు

పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల రాజకీయాలు నాటకీయ పరిణామాలతో ఒక్కసారిగా వేడెక్కాయి. శనివారం ఉదయం మమత బెనర్జీకి షాకిస్తూ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి రబీఉల్ ఆలమ్ చౌదరి, కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మమత బెనర్జీ స్వయంగా చొరవ చూపి పట్టుబట్టడంతో ఆయన తిరిగి పోటీలో నిలిచేందుకు అంగీకరించారు.శనివారం ఉదయం, రాష్ట్ర యంత్రాంగం తమ పార్టీ కార్యకర్తలను వేధిస్తోందని, తమకు అధికారిక పార్టీ గుర్తును కేటాయించలేదని ఆరోపిస్తూ రబీఉల్ ఆలమ్ చౌదరి ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం మమత వర్గంలో తీవ్ర

(మిగతా 2వ పేజీలో..)





ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు: హరీశ్‌రావు

శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం

రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం

నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ



మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో

(మిగతా 2వ పేజీలో..)

ప్రైవేట్ రంగంలోనూ లక్షల ఉద్యోగావకాశాలు

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం ఈ కార్యక్రమాన్ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , గార్లు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ " ఉద్యోగం అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే కాదు. ప్రైవేట్ రంగంలో కూడా లక్షల ఉద్యోగాలు ఉన్నవి. భారతదేశంలోనే ఇది మెగా జాబ్ మేళా . ఈ జాబ్ మెలలో ఉద్యోగం రాకపోతే నిరుత్సాహ పడొద్దు . ఓటమి గెలుపుకు తొలి మెట్టు గా భావించాలి. ఈ జాబ్ మెలను నిర్వహించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి , ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లను అభినందిస్తున్నాము ఉత్తమ్ కుమార్ రెడ్డి పని తీరు చాలా మెరుగ్గా ఉంది. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఉత్తమ్ దంపతులు ఉత్తమంగా పని చేస్తున్నారు. ఎల్నినో ప్రభావం కారణంగా కొంత కష్ట పరిస్థితులు ప్రస్తుతం ఉన్నవి.ఈ ప్రొగ్రాంలో ఎమ్మెల్యేలు బిఎల్ ఆర్ , కుంభం అనిల్ కుమార్ , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , కార్పొరేషన్ చైర్మన్లు పటేల్ రమేష్ రెడ్డి , శ్రీకాంత్ , తదితరులు పాల్గొన్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

యువతకు కాలువుల బాట.. నైపుణ్యాలే బలమైన ఆయుధం

దేశంలో యువత సంఖ్య పెరుగుతున్న కొద్దీ వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థల ముందున్న ప్రధాన సవాలు. ఉద్యోగం అంటే ప్రభుత్వ కొలువే అనే ఆలోచన నుంచి యువత బయటకు రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్, పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ విస్తృతమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యతో పాటు నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సాంకేతిక పరిజ్ఞానం కీలకం.కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ఈ దిశగా ఒక చొరవగా చూడవచ్చు. ఒకే వేదికపై వివిధ సంస్థలు, ఉద్యోగార్థులను కలిపే ఇలాంటి కార్యక్రమాలు యువతకు ఉద్యోగ మార్కెట్‌పై అవగాహన కల్పిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతకు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఎలాంటి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అయితే జాబ్‌మేళా నిర్వహించడం మాత్రమే సమస్యకు పూర్తి పరిష్కారం కాదు. ఉద్యోగం కోసం వచ్చే యువతకు ముందుగా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే శిక్షణ కూడా అందాలి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యాసంస్థల్లో బోధించే అంశాల మధ్య అంతరం ఉంటే ఉద్యోగావకాశాలు ఉన్నప్పటికీ అర్హులైన అభ్యర్థుల కొరత ఏర్పడుతుంది. అందుకే స్కిల్ డెవలప్‌మెంట్, వృత్తి శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.జాబ్‌మేళాలో ఉద్యోగం రాకపోయినంత మాత్రాన యువత నిరాశ చెందకూడదు. ఒక ఇంటర్వ్యూలో ఎదురైన వైఫల్యం తదుపరి అవకాశానికి అవసరమైన లోపాలను గుర్తించే అవకాశం కూడా అవుతుంది. రెజ్యూమ్ తయారీ నుంచి ఇంటర్వ్యూ నైపుణ్యాల వరకు అభ్యర్థులు నిరంతరం తమను తాము మెరుగుపరుచుకోవాలి. ఉద్యోగం కోసం ఎదురుచూడటంతో పాటు స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, ఫ్రీలాన్సింగ్, చిన్న వ్యాపారాల వైపు కూడా యువత దృష్టి సారించాలి.ప్రభుత్వాల బాధ్యత కూడా ఇక్కడే కీలకం. ఉద్యోగ మేళాలు కేవలం కార్యక్రమాలుగా మిగలకుండా, ఎంపికైన అభ్యర్థులకు నిజంగా ఉద్యోగాలు లభించాయా? సంస్థలు ఇచ్చిన హామీలు అమలయ్యాయా? ఉద్యోగంలో చేరిన వారి పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై ఫాలోఅప్ వ్యవస్థ ఉండాలి. జిల్లాల వారీగా స్థానిక పరిశ్రమల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. యువతకు ఉపాధి కల్పించడం అంటే కేవలం ఒక ఉద్యోగం ఇవ్వడం కాదు. ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కూడా. అందుకే జాబ్‌మేళాలు నిరంతర ప్రక్రియగా మారాలి. విద్య--నైపుణ్యం--ఉపాధి మధ్య బలమైన వారధి ఏర్పడినప్పుడే యువత శక్తి రాష్ట్ర అభివృద్ధికి సంపూర్ణంగా ఉపయోగపడుతుంది.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: ప్రజలను కోరిన సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.మూడు ప్యాకేజీల్లో పనులు విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి)

విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.“నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు” అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

పోటీ నుంచి వైదొలగినట్లు ప్రకటన.. గంటల్లోనే మనసు మార్చుకున్న మమతా బెనర్జీ పార్టీ అభ్యర్థి

మొదటి పేజీ తరువాయి)

గందరగోళానికి దారితీసింది. అయితే, వెంటనే రంగంలోకి దిగిన మమత బెనర్జీ ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆయనతో చర్చలు జరిపారు. పార్టీ అధిష్ఠానం ఒత్తిడితో తన మనసు మార్చుకున్న రబీఉల్, తాను పోటీలో కొనసాగుతున్నట్లు మధ్యాహ్నం స్పష్టం చేశారు.అక్టోబర్ 6న రెజీనగర్‌తో పాటు నందిగ్రామ్‌లోనూ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నందిగ్రామ్‌లో మమత వర్గం అభ్యర్థిగా ప్రకటించిన సంచితా ప్రధాన్ డే, ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన అనంతరం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు ప్రకటించగా, ఆ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను 2007 నాటి ఓ పాత హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం.తృణమూల్ కాంగ్రెస్‌లో తలెత్తిన చీలిక కారణంగా ఎన్నికల సంఘం పార్టీ పేరును, గుర్తును తాత్కాలికంగా స్తంభింపజేసింది. మమత వర్గానికి “మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్” పేరుతో “ఫుట్‌బాల్ ప్లేయర్” గుర్తును, ప్రత్యర్థి వర్గానికి “డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్” పేరుతో “ఎన్వలప్ కవరు” గుర్తును కేటాయించింది. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ మమత బెనర్జీ ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పరిణామాల మధ్య బెంగాల్ ఉప ఎన్నికలు సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి.

తెలంగాణలో మళ్లీ వానలు: నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి)

చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో నేటి (19వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.బంగాళాఖాతంలో సెప్టెంబర్ 19 సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది.ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. నేడు, రేపు.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి.హైదరాబాద్ నగరంలోనూ సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రుతుపవనాల తిరోగమనం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని, అక్టోబర్ రెండో వారం వరకు వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

స్టార్టప్‌లే భారతదేశపు యువత సత్తాకు నిదర్శనం..!

మొదటి పేజీ తరువాయి)

చూపిస్తోందని వివరించారు.చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ తమతోపాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఈ లక్ష్యంతోనే సుమారు రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుందన్నారు.మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతోపాటు కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. మీరు మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలని ప్రధాని అన్నారు. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి' ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'అ+ూ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరేవారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని చెప్పారు.

రేవంత్ ఆ డైలాగ్‌ను దించేశాడు.. నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

దేవుడు బ్రహ్మాండంగా అన్ని ఇచ్చిండు. దేవుడు మన కేసీఆర్‌ను కూడా ఇచ్చిండు. కేసీఆర్ కరెంట్ తెచ్చి సబ్‌స్టేషన్లు కట్టిండు. బ్రహ్మాండంగా కరెంట్ ఇచ్చిండు. కానీ దురదృష్టమేంటంటే దేవుడు అన్ని ఇచ్చినా మరి పూజారి కరుణించలేదన్నట్టు ముఖ్యమంత్రిగా కూర్చున్నోడికి తెలివిలేక, కరెంట్ ఇచ్చే తెలివి లేక ఇయ్యాళ్ల రైతులను అవస్తలు పెడుతున్నడని ఫైర్ అయ్యారు. యూరియా ఇచ్చే తెలివిలేదు.. రైతు బంధు ఇచ్చే తెలివిలేదు.. రుణమాఫీ ఇచ్చే తెలివిలేదు.. బోనస్ ఇచ్చే తెలివి లేదు.. ఆఖరికి నీళ్లు ఇచ్చే తెలివి కూడా లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90% పూర్తి చేసి కేసీఆర్ మీకు అప్పజెప్పి పోయారు. ఏనుగు వెళ్లింది తోక చిక్కిందన్నట్టు 10 శాతం పని మిగిలి ఉంది. ఓ 4-5 మీటర్ల కాలువ తవ్వితే అక్కడి దాకా కొడంగల్ దాకా నీళ్లు పోతయ్. కానీ ముఖ్యమంత్రికి ఇష్టం లేదు.. జల్దీజల్దీ చేస్తే కేసీఆర్‌కు పేరొస్తది కదా..అది రానియ్యా అని రేవంత్ ఫిక్సయ్యాడని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నార్లాపూర్ దగ్గర ఒక పంప్ ఆన్ చేసి పోయిండు. మరి కేసీఆర్ చేసిన పనే అని రైతులకు తెలుస్తది.. తప్ప నాకు పేరు రాదు అని చెప్పి.. రేవంత్ రెడ్డి ఎప్పుడూ తొక్కుకుంటూ వచ్చిన.. పండబెట్టిన అని డైలాగ్ చెబుతుంటడు. నిజంగానే ఇయ్యాళ్ల పాలమూరు వ్యవసాయాన్ని పండబెట్టిండు. పాలమూరు రైతులను తొక్కుతున్నడు. నీళ్లు ఇయ్యకుండా మీ బతుకులు ఆగం చేస్తా ఉన్నడని మండిపడ్డారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ | ఆదివారం | 20 | 2026

22-ఏ భూములపై దుష్ప్రచారం వద్దు

అర్హులైన భూ యజమానుల సమస్యలను పరిష్కరిస్తాం: కాంగ్రెస్ నేతలు

వరంగల్ విజయ కెరటం, సెప్టెంబర్ 19:

22-ఏ నిషేధిత జాబితాలోని భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించేలా ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, వరంగల్--హనుమకొండ సమన్వయకర్త డా. కోటూరి మానవతారాయ్ ఆరోపించారు.శనివారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. 22-ఏ సమస్య కొత్తగా ఏర్పడింది కాదని, గత ప్రభుత్వాల కాలం నుంచే నిషేధిత భూముల జాబితా అమలులో ఉందని మానవతారాయ్ పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన అర్హులైన ప్రైవేటు భూముల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూ భారతి ద్వారా నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడంపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సేవ అందుబాటులో ఉందని తెలిపారు.22-ఏ భూముల సమస్యను కోట్లాది మంది ప్రజల సమస్యగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం సరికాదని అన్నారు. భూ రికార్డుల సమస్యలపై ప్రజలు వాస్తవాలను తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు.

ఆక్రమణలపై చట్టప్రకారం చర్యలు

భూదాన్, వక్ఫ్ భూముల ఆక్రమణలపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ స్పందించారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై రాజకీయ సంబంధాలతో సంబంధం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారానికి దూరంగా ఉండాలని సూచించారు.జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని అయూబ్ తెలిపారు.హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా సమస్యలను పరిశీలించాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు.సమావేశంలో టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ణాటి పార్వతమ్మ, యూత్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, జిల్లా అధికార ప్రతినిధులు నిమ్మ నిశేఖర్‌రావు, ఎర్ర యాకూబ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కమలుద్దీన్, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రహమతుల్లా, మహిబూద్ పాషా తదితరులు పాల్గొన్నారు.




పేదల వైద్యానికి ఎల్ఓసీ భరోసా

- **ఇద్దరు బాధిత కుటుంబాలకు రూ.7.75 లక్షల ఆర్థిక సహాయం**

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 19:

అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పేద కుటుంబాలకు నిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్స కోసం మంజూరైన ఎల్ఓసీలను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య శనివారం అందజేశారు. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన ఆరిఫ్ పాషా తండ్రి షేక్ అబ్దుల్ హమీద్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వెళ్లగా, వైద్యులు పరీక్షించి చికిత్సకు రూ.5 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. అలాగే వరంగల్‌కు చెందిన కొండి రాజకుమార్ కాలేయ సంబంధిత అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిని సంప్రదించగా, చికిత్సకు రూ.2.75 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు.ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం చేయాలని బాధిత కుటుంబాలు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యను ఆశ్రయించాయి. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాసి ఎల్ఓసీలు మంజూరు చేయాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి ఇద్దరు బాధితులకు ఎల్ఓసీలు మంజూరు చేసింది.మంజూరైన ఎల్ఓసీలను బాధిత కుటుంబ సభ్యులకు బస్వరాజ్ సారయ్య తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, ముఖ్యంగా పేదల వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నల్లగొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శ్రీమన్ శిరీష, పుల్ల రమేష్, ఐఎన్‌టీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రవి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గోరంటాల రాజు, కాంగ్రెస్ నాయకులు జీవన్, ఎం.బి. అమరేందర్, సింగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.


నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (స్రూఖీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (స్రూఖీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.



మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.



ఎఫ్‌సీఐ నల్గొండలో స్వచ్ఛతా హి సేవా 2026 లో భాగంగా పారిశుధ్య కార్మికులకు వైద్య ఆరోగ్య శిబిరం



నల్గొండ, సెప్టెంబర్ 19 విజయ కెరటం ప్రతినిధి

"స్వచ్ఛతలో భాగస్వామ్యం స్వచ్ఛ భారత్, వికసిత భారత్" అనే థీమ్‌తో స్వచ్ఛతయె సేవ (SHS)--2026 కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ కార్యాలయం/బీఎస్‌సీ నల్గొండలో పారిశుధ్య కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యుల కోసం నల్గొండ రివర్ నిమ్స్ ఆసుపత్రి వైద్యులు డా.కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సంస్థ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యం మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ శిబిరంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అవసరమైన వైద్య సూచనలు, ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు కృష్ణమూర్తి , రత్న స్వప్న , ఏడుకొండలు , రాకేష్ , ఉద్యోగులు బాబీ నాయక్, క్రాంతి, సతీష్ రెడ్డి , రాఘవేంద్ర , జనార్దన్ , అజయ్ , రాజు , హమాలీల ప్రతినిధి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలి: మాజీ ఎమ్మెల్యే

నల్లగొండ సెప్టెంబర్ 19 విజయ కెరటం ప్రతినిధి

నల్గొండ పట్టణంలోని యాటకన్నా రెడ్డి కాలనీలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శ్రీ శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో నల్గొండ మాజీ శాసనసభ్యులు శ్రీ కంచర్ల భూపాల్ రెడ్డి గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ యువత సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. యువత దేశానికి వెన్నుముక లాంటి వారని, సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజులపాటు శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ పట్టణ బోనగిరి దేవేందర్ మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి మొరిశెట్టి నాగేశ్వరరావు రాపోలు వెంకటేశ్వర్లు సిరిగిరి వెంకట్ రెడ్డి యాట నిఖిల్ రెడ్డి ఎర్రబోతు వినీత్ రెడ్డి నాగోతు అభిరామ్ సురేష్ రెడ్డి అశోక్ రెడ్డి మెక్ బాను యాట సునీత మానస యాటభరతమ్మ శోభారాణి పద్మ రాములమ్మ పూలమ్మ యాట వరుణ్ రెడ్డి యాటకన్నా రెడ్డి కాలనీ యువకులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



విజయకేరటం
తెలుగు దినపత్రిక

‘వెల్‌కమ్ ‘2’ బేబీ గర్ల్’.. రెండో బిడ్డకు జన్మనిచ్చిన దీపికా పదుకొణే

పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన బాలీవుడ్ నటి

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శుభవార్తను పంచుకున్న స్టార్ కపుల్

దీప్‌వీర్‌కు వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు

పెద్ద కూతురు దువాకు చెల్లి వచ్చిందంటూ ప్రముఖుల పోస్టులు



బాలీవుడ్ స్టార్ కపుల్ రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొణే దంపతులకు రెండో బిడ్డ జన్మించింది. శనివారం దీపిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ దంపతులకు ఇది రెండో సంతానం కాగా, ఇద్దరూ కుమార్తెలే కావడం విశేషం.ఈ శుభవార్తను రణ్‌వీర్, దీపికా దంపతులు తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా వెల్లడించారు. చిన్నారి పాదముద్రల ఫొటోను షేర్ చేస్తూ, ‘వెల్‌కమ్ బేబీ గర్ల్, 19/9/2026, దువా, దీపిక, రణ్‌వీర్’ అని పేర్కొన్నారు. దిష్టి తగలకూడదనే అర్థం వచ్చేలా ఎమోజీని కూడా జతచేశారు. ఈ పోస్ట్ చూసిన వెంటనే బాలీవుడ్ ప్రముఖులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.ఈ పోస్ట్‌పై నటి కృతి సనన్ స్పందిస్తూ, “అభినందనలు! దువాకు తోడుగా చెల్లెలు వచ్చింది. ఇది నిజంగా దేవుడి ఆశీర్వాదం” అని వ్యాఖ్యానించారు. గాయని శ్రేయా ఘోషల్, నటి కృతి కర్బందా, డిజైనర్ మసాబా గుప్తాతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ జంటకు అభినందనలు తెలిపారు.బిడ్డ పుట్టడానికి ఒకరోజు ముందు, శుక్రవారం ఈ జంట ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి మొదటి కుమార్తె దువా జన్మించే ముందు కూడా వీరు ఆలయానికి వెళ్లి ఆశీస్సులు తీసుకోవడం గమనార్హం. రణ్‌వీర్, దీపిక దంపతులు 2018 నవంబర్‌లో ఇటలీ వేదికగా వివాహం చేసుకున్నారు. వీరికి 2024 సెప్టెంబర్ 8న మొదటి కుమార్తె దువా జన్మించింది.

ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా: విజయ్ సేతుపతి

తన ‘మహారాజా’ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందన్న విజయ్ సేతుపతి

ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పారని వెల్లడి

అందులో తనకు ఒక చిన్న పాత్ర ఇప్పించాలని సరదాగా అడిగానని వ్యాఖ్య

విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘మక్కల్ సెల్వన్’ విజయ్ సేతుపతి తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తనకు ‘మహారాజా 2’ కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. ‘మహారాజా’ మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.అంతేకాకుండా, ‘మహారాజా’ సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... “ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను” అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.





ఆ స్టార్ పేరు చెబితే షాకవ్వుతారు: రాధికా ఆప్టే

కెరీర్ ఆరంభంలో బోల్డ్ పాత్రల వల్లే ఇబ్బందులన్న రాధికా ఆప్టే

అనవసరంగా ఇంటిమేట్ సీన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని వ్యాఖ్య

ఆ స్టార్ పేరు చెబితే అందరూ ఆశ్చర్యపోతారని వ్యాఖ్య

హిట్ కోసం నటీనటుల హద్దులు దాటించడం సరికాదన్న నటి

బాలీవుడ్ నటి రాధికా ఆప్టే చిత్ర పరిశ్రమలో తనకు ఎదురైన కొన్ని ప్రతికూల అనుభవాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కెరీర్ తొలినాళ్లలో కొన్ని బోల్డ్ పాత్రల్లో నటించిన కారణంగా, కథలో ఆవశ్యకత లేకపోయినా కొందరు దర్శకులు, నిర్మాతలు తనను శృంగార సన్నివేశాల్లో నటించమని ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.“కథా గమనంతో సంబంధం లేకపోయినా, కేవలం 15 సెకన్ల పాటు ముద్దు సీన్‌ను చిత్రీకరిద్దాం అని చాలా చులకనగా అడుగుతుంటారు. అలాంటి మాటలు విన్నప్పుడు నాకు నవ్వొస్తుంది” అని రాధికా పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కథకు అత్యవసరమైతే తప్ప ఇటువంటి సన్నివేశాల్లో నటించడం లేదని, ఆ సన్నివేశం వెనుక ఉన్న సహేతుకమైన కారణాన్ని అడిగి తెలుసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.గతంలో ఓ సందర్భంలో యాక్షన్ సీక్వెన్స్ కోసం చొక్కా గుండీలు విప్పి నటించమన్నారని, ఆ తర్వాత లోదుస్తులతో మాత్రమే చేయాలని కోరారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సన్నివేశం ఉద్దేశాన్ని ప్రశ్నించి, చివరకు అందుకు తాను నిరాకరించానని తెలిపారు. అయితే, తనను అలా కోరిన వ్యక్తి పేరు చెబితే అందరూ ఆశ్చర్యపోతారని, చిత్ర పరిశ్రమలో ఆయనకు విశేషమైన గుర్తింపు, ఉన్నత హోదా ఉన్నాయని ఆమె పేర్కొనడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.కేవలం సినిమా విజయం కోసమే నటీనటులు తమ హద్దులు దాటాలని ఒత్తిడి చేయడం ఏమాత్రం సమంజసం కాదని రాధికా అభిప్రాయపడ్డారు. రాధికా ఆప్టే ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా రానున్న ‘లస్ట్ స్టోరీస్ 3’ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. ఇందులో సిద్ధార్థ్, అదితి రావు హైదరి, విజయ్ వర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528